# నార్ల వ్యాసాలు

విద్వాన్ విశ్వం

సారస్వతం బహుముఖాలా తీవలు సాగినప్పుడే మన సంస్కృతి విస్తృతమవుతుంది. సమాజం బాగా అభివృద్ధి చెందినప్పుడే సారస్వతం, వివిధ శాఖలుగా విడిపోయి ఒక్కొక్క దానిలోను కావలసినన్ని రచనలు వెలువడుతాయి

ఒకానొకప్పుడు మన సమాజం శాంత్యభ్యుదయ పరిప్లుత మవుతున్నప్పుడు పాయలు పాయలుగా చీలిన వాఙ్మయ వాహిని, పరదాస్య పరాభూతమయిన స్థితికి రాగనే చాల వరకు శుష్కించిపోయి ఒక్క కావ్యరూపం మాత్రమే ఏదో అటుకొటు ప్రాణంతో నిలిచినది.

మరొక్క తూరి జాతీయోద్యమం దేశాన్ని ఉర్రూత లూగించగనే, సాంస్కృతికరంగంలో జీవం సంచలించగనే తిరిగి సారస్వతం కూడ మొగ్గ దొడిగినది. అప్పుడే స్వతంత్ర నాటకాలు, ఖండ కావ్యాలు, కధానికలు, గల్పికలు, ఏకాంకికలు, నవలలు, వ్యాసాలు, గేయాలు—ఇలా రంగు రంగుల పువ్వులతో తెలుగుతోట కనులు మిరుమిట్లు గొలుప సాగినది.

మన సారస్వతంలో ప్రస్తుతం బహుళ ప్రచారంలోనికి రానిది సృజనాత్మక వ్యాస రచన ఈ మాట కొంత పెద్దగా నున్న మాట వాస్తవమే. కాని ఒక వినిర్దిష్ట రూపాన్ని సూచించడం కోసం ఉపయోగించ వలసి వస్తున్నది.

ముఖ్యంగా ఒక్కొక్క అంశంపై హేతువాదబద్ధంగా చర్చసాగించి వివరించే రచనలను కూడ వ్యాస మనడం అలవాటు. రాజ్యాంగం, సామ్రాజ్యవాదం, భాషాశాస్త్రం—ఇలా వేనిని గూర్చో వ్రాసిన వాని కన్నిటకు వ్యాసాలని పేరు పెట్టవచ్చును. నే నిప్పు డిక్కడ వానినిగూర్చి మాట్లాడడం లేదు.

మరి ఆంగ్ల సారస్వతంలో Light essay అన్నశాఖ ఒకటి బాగా విరియబూసిన పూలతో తులతూగుతున్నది. ఒక అనుభూతిని, లేదా ఒక సంఘటనను, ఒక చిన్న అంశాన్ని తీసుకొని (Creative) సృజనాత్మకంగా ఖండకావ్యంలా వ్రాసిన వానినే ఈ శాఖలో చేర్చడం అలవాటు. వీనికే నే నిక్కడ సృజనాత్మక వ్యాసా లంటున్నాను. Light essay అన్నమాట ననువదించడంవల్ల చక్కని పేరు కుదరక పోవడం వల్లనే creative అనే పదాన్ని ఊతగా ఉపయోగించు కొనవలసి వచ్చింది.

గార్డినర్, లిండ్ మొదలగు వారు, ఆంగ్లంలో ఈ శాఖలో సిద్ధహస్తులు ఏ చిన్న అంశమైనా, ఏ క్షణికానుభూతియైనా వీరికి ఉపాదేయమే ఆ యింతను కేంద్రంగా చేసు కొని వీరు లక్ష సంగతులను యాదాలాభంగా మన చెవిని వేస్తారు. సునిశిత ప్రతిభతో చిన్న చిన్న సంఘటనలయినా. వాని అంత రాంతరాలలోనికి చొచ్చుకొని పోయి, లోపలి లోతులలోని చీకటి వెలుగులను కానిపింప జేస్తారు. ఒక్కొక్క వాక్యంలోనే మన కేదో అతి సన్నిహితమైన అంశాన్ని భూతద్దంవేసి చూపుతారు

ఒక్కొక్క ప్రత్యేక వాతావరణంలోనే అసలు ఏ ప్రత్యేక శాఖైనా బయలుదేరుతుంది. పత్రికల ఆరంభంలోనే మనకీ శాఖపైనికి దృష్టి మరలినది. తొలుత తొలుత సాక్షి వదరుబోతులలో వెలువడి నవ్వు దీవ్యాస రూపం నర్మ గర్భితంగా పిచ్చి ఆచారాలపై మొండి ఘటాలపై చేసన మర్మాఘాతంగా మాత్రమే కనిపిస్తూ వచ్చింది. కబుర్లు, పాన్ సుపారీలు వగైరా రూపాలతో వెలువడినప్పుడు తాత్కాలిక వార్తలపై, సంఘటనలపై ఛలో క్తులతో విసిరిన విసురులుగా ఇవి తల చూపి నవి. తెలుగువ్యాసం పుట్టు పూర్వోత్తరాల సమగ్ర చరిత్ర నా ఇప్పటి విషయం కాదు. కాబట్టి ప్రస్తుతం Light essay గా బాగా రూపొందిన వ్యాస సంపుటలను గూర్చే చెబు తాను

మాటామంతీ, పిచ్చాపాటీ :

శ్రీ నార్ల వెంకటేశ్వర రావుగారు క్రొత్తగా మాటామంతీ. పిచ్చాపాటీ అనే రెండు వ్యాస సంపుటులను ప్రచురించారు. రెంటిలోను మొత్తం 28 వ్యాసాలున్నవి. జీవితంలోని ఎవిధాంశాలు వీనికి వస్తువులైనవి.

సొంత పుస్తకం, క్షుద్ర విశ్వాసాలు మొదలు సందేశాలు, మామిడిపండు వరకు వీని శీర్షికలు. వీనిని ఒక్కొక్క దానిగా కాక వీనిలో అనుస్యూతమై ఉన్న ప్రధాన విశిష్టాం శాలను గూర్చే చెబుతాను

లోకోక్తులు:

మనదేశంలో కేవలం అసలు స్వదేశ సంస్కృ తిని ప్రతిఫలించేవి ఒక్క లోకోక్తులేనేమో! వానిలో మన సాంప్రదాయాలు, మన మన స్తత్వవైఖరులు. మన నిశితదృష్టి ఒకటే మిటి తెలుగు హృదయమే అందులో జీవంతో జీవజీవ లాడుతుంది ఈ లోకోక్తులను వీరు కొల్లలుగా ఉచితజ్ఞతతో, సందర్భ శుద్ధితో ఈ వ్యాసాలలో ఉపయోగించారు. వీరికి జానపద జీవితంతోను, తెలుగు పలుకు బడులతోను, బ్రతుకు తీరులతోను, గాఢమైన సన్నిహితత్వ మెంతగా ఉన్నదో ఇవి వేనోళ్ల చాటుతున్నవి "దంచి నమ్మకు బొక్కినదే కూలి" "కూలికి వచ్చి పాలికి మాట్లాడినట్టు" "పరుగెత్తి పాలు తాగేకన్న నిలుచుండి నీళ్లు తాగడం మేలు", వగైరాలు మొదలు, "ఊరంద రిదీ ఒకదారి, ఉలిపికట్టె దొక దారి," "పిల్ల పోయినా పురికటింపు పోలేదు." ఇలాంటివాని వరకు వీరెన్ని లోకోక్తులనో మన యెదుట నుంచారు.

పాతకథలు :

"అనెక్డోట్సు"గా చాలమంది సహృదయులు చేరినప్పుడు చెప్పుకునే వానిలో లక్ష సంగతులు వెల్లివిరుస్తుంటాయి. ఇవి వివిధ ముఖాలా దేశమంతటా వ్యాపించి వాసనల గుబాళిస్తుంటాయి. ఎందరు ప్రముఖ వ్యక్తుల మనస్తత్వాలనో, ఎన్ని సంఘటనలనో, ఎన్ని దేశీయ విశిష్టతలనో వీనిద్వారా మనం తెలుసుకుంటుంటాము. ఇలాంటివానిని వీరి ప్రతి వ్యాసంలోను మనం చూడవచ్చును. ప్రాచీన కాలపు పైథియన్, ఆర్కిమిడిస్ లాంటివారికి చెందినవి మొదలు, మొన్నమొన్నటి షా. చెస్టర్టన్. చర్చిల్ లాంటివారి వరకు చెందిన వానినికూడ వీరు గ్రంథస్థం చేశారు. వీరి బహు గ్రంథపరనం, బహుసహృదయ సాంగత్యం వీనిలో తొంగిచూస్తాయి.

వీనిలో ఇతరదేశాలవే కాక, మనదేశం కథలున్నా, మరికొన్ని మనవిచేరితే ఎంత బాగుంటుందో ననిపిస్తుంది. ప్రస్తుతం మన పాతపండితులు చెప్పుకుంటూవచ్చే కథలు మాసిపోతున్నవి. కారణం అవి గ్రంథస్థం కాలేదు. మరి మనతరంవారిలో చాలామందికి పాతపండితుల చేవగల సంభాషణలతో మాలిమి,చేరువ చాల తక్కువ. వీనిని ప్రచారం చేయాలి.

ఛలోక్తులు:

ఛలోక్తులతో, నిశితంగా మన వక్రవర్తనలపై వీరు చాల విసురులు విసిరారు. "గార్ధభాన్ని క్షుద్రజీవిగా యెంచిన మాసిడోనియన్ దండనాథుడైనా క్షంతవ్యుడు కాగలడు గాని, గాడిద కూస్తే చేస్తున్నవని మానుకునేవాడు మాత్రం క్షమార్హుడు కానేరడు. ఎంతటి'' గట్టి మాటః మంత్రయుగం అనే వీరి వ్యాసం వ్యాసమే, మన మొండినమ్మకాలపై చక్కని ఛలోక్తి. "ఇప్పటికైనా మనం పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికలపై ప్రాకులాటమాని, విద్యాలయాలకు, వైద్యాలయాలకు డబ్బు పారబొయ్యక దేశాన్ని తపోవనాలతో నింపివెయ్యాలి; గుళ్ళూ గోపురాలు కట్టించాలి; పూజలూ పునస్కారాలూ జరపాలి, యాగాలూ యజ్ఞాలూ చెయ్యాలి. వర్ణాశ్రమ ధర్మాలను పునరుద్ధరించాలి; సనాతన ధర్మాన్ని పునః ప్రతిష్ఠాపన చెయ్యాలి .అప్పుడుగాని ధర్మదేవత వెకిలిచేష్టలు మాని, తిరిగి నాలుగు కాళ్ళమీద నడవదు. అప్పుడుగాని తిరిగి రామరాజ్యం నెలకొనదు". ఇలాంటివే పరామర్శ, సందేశాలు కవులథంకా, స్మారక చిహ్నాలు— లాంటి వ్యాసాలు.

నిశితపరిశీలన :

"రంగు అద్దాలు'' అనే వ్యాసంలో వీరి నిశితదృష్టి ప్రస్ఫుటమవుతుంది. "మనం దేన్ని హర్షించినా, దేన్ని విద్వేషించినా,మన అనుబంధాలను అధిగమించి, మన అనుభూతులకు అతీతంగా ఉండి, ఆ కార్యం చేస్తున్నామా అనే ఆత్మపరీక్ష అవసరమేమో!" అంటూ "మనకు ఆలోచనాశక్తి ఉన్నదనుకుంటాము. వివేచనాపటిమ ఉన్నదని గర్విస్తాము. కాని దేన్నికూడా మన అనుబంధం, మన అనుభూతి అనే రంగు అద్దాలగుండా తప్పితేచూడలేము'' అంటారు వీరు. ఇది నిజం

రీతి :

వీరి మొదటి మాటామంతీ, పిచ్చాపాటీ లోకి దిగేసరికి బాగా బరువెక్కినది వ్యాస రచనలలో ప్రధానమైన ప్రవాహ గమనవేగం వీనిలో ప్రతిపుటలోను కనిపిస్తుంది ఏ విశిష్ట విషయ పరిశీలనకో చెందిన పారిభాషిక పద జటిలత లేక, ఏ కేవలం ఉబుసుబోం మాటల పోవులుగానో, దూదిలా గాలిలో తేలిపోక—ఉన్న ఒక ప్రత్యేకరీతి వీరిరచన కబ్బిన గొప్ప ఆదరువు, మురువుకూడ.

ఇలాంటి వివిధ వ్యాస సంపుటిని మన కందించి, వీరు మన తెలుగు తోటలో అట్టే పూతపూయని కొమ్మను, రంగుల పూవులతో వలపులు విరిజల్లే మొగ్గలతో నింపారు. మన పారక లోకం వీరికి తప్పక కృతజ్ఞత వెల్ల డిస్తుంది.

ఈ శాఖలోనే వీరు మరిన్ని రచనల నందించాలి ఏ కాంకికలో వీరు చేసిన కృషి "తెలుగు గడ్డ"లో వాసికెక్కినది. మన "పిచ్చాపాటీ" "మాటా మంతీ"లో కూడ, వీరి అనుభూతులు వ్యాపించాలని ఆశి స్తున్నాను.

కొత్తమాటలు:

వీనిలో అక్కడక్కడ ఒకటి రెండు చెవి కొట్టే చక్కని సవ్వడి నీని మాటలున్నవి. ఇలాంటివి—కాదు ఇవి మాత్రమే—"తస్కరణ విద్య" "కథ కాయించి" "రోతిగించు కోకుండా" "ముక్కోళ్ళ వెంట నీళ్ళు" "ఊసరవెల్లి క్షేత్రాలు"–రెండవ ముద్రణలో తొలగిస్తారనుకుంటాను. అలాగే "క్షణక్షణం పెచ్చుపెరిగే అసహనంతో కళ్ళు కాయలు కాచేటట్టు ఎంతగా ఎదురు తెన్నులు చూస్తుంది."లో అసహనం అతకదు ఎవరి వాగునైన చూచి ఓర్వలేక పోవడమే అసహనంగా రూఢి. కాకులజాతిలో "ఏకాకి" చేరిక ఎబ్బెట్టుగానున్నది. ఇవి తొలగించడం మరింత బాగుంటుందని మాత్రమే నే నంటు న్నది.

ముచ్చటైన ముద్రణ:

వీరు రచనలో చూపి నంత శ్రద్ధా. పుస్తక ప్రచురణలో చూపడం ముదావహం చక్కని బొమ్మలతో, భావగర్భిత రేఖలతో ముచ్చట లొలుకుతున్న వీసంపుటాలు. అచ్చుతప్పులు—నే చూచినంతలో—ఏ రెండుమూడింటితోనో మాత్రమే ఇంత పుస్తకాలు వెలువడడం ఇదే మొదలు, వెలకూడ చాల చౌకఅని చెప్పితీరాలి ఇన్ని హంగులతోను ఒక్కొక్క సంపుటిని ఒకటిన్నర రూపాయకే అందివ్వడం తప్పక అభినందనీయ మైన సంగతి.

ఈ పుస్తకాలు మన పుస్తకాలయాల కలంకారాలు కావాలి. పారకుల ఆదరణకు పాత్రం కావాలి, బహుళ ప్రచారాన్ని అందు కోవాలి, మరి కొందరు రచయిత లీశాఖలో కృషి చేసేందుకు దోహదమివ్వాలి ఈ నా ఆశ అడియాస కాదని విశ్వసిస్తున్నాను.

Source: Press Academy Website, Kinnera Magazine, June 1951

Disclaimer: This SELECTIVE topic/article/write-up of Vidwan Viswam (Meesaraganda Viswam) gaaru is nostalgic. It has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience.

No intention what so ever of copy right violation is involved.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with due apologies.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/